PRAJA SANKALPAM మంగళవారం, 24 నవంబరు 2026 మారో ప్రజా సంకల్పం 4

ఏపీలో ఓటు చోరీ నిజమే!



అర్ధరాత్రి ఓట్ల మతలబేమిటి?

ఎస్ఐఆర్ పేరిట ఓట్ల తొలగింపుపై ఆరోపణలు. సీఈసీపై తాజాగా వ్యక్తమవుతున్న అభ్యంతరాలు. ఈవీఎంలకు బదులు బ్యాలెట్ పద్ధతిని తీసుకురావాలన్న డిమాండ్లు ఎన్నికల వ్యవస్థ పారదర్శకతపై మరిన్ని ప్రశ్నలను ముందుకు తెస్తున్నాయి. ఓటరు వేసిన ఓటే నమోదైందా? నమోదైన ఓటే లెక్కించారా? అర్ధరాత్రి పెరిగేగట్లు చెబుతున్న పోలింగ్‌కు ఆధారాలేమిటి? వీవీప్యాట్ స్లిప్పులను పూర్తిగా లెక్కించారా? సీసీటీవీ ఫుటేజీలు బయటపెడతారా? ఇలా అనేక సందేహాలకు సమాధానం చెప్పే నాథుడే లేడని ప్రజలు చర్చించుకుంటున్నారు.

నాడు గెలిచింది చంద్రబాబు కాదు.. జగనే!



ఆంధ్రప్రదేశ్ లో గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంల వాడకానికి సంబంధించి అక్రమాలు జరిగినట్లు ప్రముఖ సామాజిక వేత్త పరకాల ప్రభాకర్ చేసిన సర్వే, విశ్లేషణ వాస్తవానికి దగ్గరగా ఉంది. ఇదంతా పరిశీలిస్తే నాడు గెలిచింది చంద్రబాబు కాదు.. వైయస్ జగన్ మోహన్ రెడ్డి అనేది ఒక అనాలసిస్. పరకాల సర్వే ప్రకారం 2024 ఎన్నికల్లో ఏపీలోని 1,400 పోలింగ్ బూత్ లలో నమోదైన ఓట్ల వివరాలు పరిశీలిస్తే కొన్నింట 500 ఓట్లు అదనంగా పడ్డాయని స్పష్టమైంది. 1,500 ఓట్ల సామర్థ్యం ఉన్న బూత్ లలో 2 వేల వరకు ఓట్లు లెక్కింపులో రావడం దారుణమైన పరిస్థితికి అద్దం పడుతోంది. సర్వేలో వెల్లడైన గణాంకాల ఆధారంగా విశ్లేషిస్తే గెలవాల్సిన అభ్యర్థులు ఓడిపోవడం, ఓడాల్సిన వారు గెలవడం జరుగుతోంది. ఈ అంశంపై దేశా సైంటిస్టులు నిపుణులు సమగ్ర పరిశీలన జరిపి ఇవన్నీ అవకతవకలేనని నిర్ధారించారు. దీనిపై విశ్లేషకులు ఎన్నికల కమిషన్ కు కూడా లేఖ రాశారు. పరకాల సర్వే ప్రకారం దేశవ్యాప్తంగా దాదాపు 79 పార్లమెంట్ స్థానాల్లో ఫలితాలు తారుమారయ్యాయి. తద్వారా కేంద్రంలో ప్రభుత్వాలే మారిపోయే పరిస్థితి ఏర్పడింది.

- తమ్మినేని వీరభద్రం, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు

ఏపీలో అర్ధరాత్రి ఓట్ల మాయాజాలం



2024 మే 13న సాయంత్రం 5 గంటలకు 68.04 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించగా, తుది లెక్కల్లో పోలింగ్ 81.79 శాతంగా నమోదైంది. రాత్రి 11.45 గంటల నుంచి తెల్లవారుజాము 2 గంటల మధ్య మూడున్నర గంటల్లో 3,500 పోలింగ్ కేంద్రాల్లో 17,19,482 ఓట్లు నమోదయ్యాయి. అంటే ఒక్కో బూత్‌లో సగటున 492 ఓట్లు, నిమిషానికి 3.6 ఓట్లు చొప్పున పోలైనట్లు. పగటి సమయంలో ఒక్కో బూత్‌లో సగటున గంటకు 60.7 ఓట్లు మాత్రమే పోలవగా, అర్ధరాత్రి సమయంలో గంటకు 200కు పైగా ఓట్లు ఎలా నమోదయ్యాయి? అంటే ఒక నిమిషానికి ముగ్గురు ఓటర్లు ఓటు వేశారా? ముమ్మాటికీ ఇది అసాధ్యం. ఒక్కో ఓటుకు సుమారు 20 సెకన్ల సమయం మాత్రమే పట్టింది, ఇది సాధ్యమేనా? ఇతర దేశాల్లో ఒక్క ఓటు వేయడానికి 76నుంచి 123 సెకన్ల సమయం పడుతోంది. అర్ధరాత్రి పెద్ద సంఖ్యలో ఓటర్లు క్యూలో నిలబడ్డారంటే, వారి వీడియోలు, సీసీటీవీ ఫుటేజీలు ఎందుకు బయటపెట్టడం లేదు. పోలింగ్ సిబ్బంది రికార్డు పుస్తకాల్లో క్యూలో ఉన్న ఓటర్ల వివరాలు నమోదు చేశారా? నమోదు చేస్తే వాటిని ఎన్నికల సంఘం వెల్లడించాలి. ఈవీఎంల ద్వారా నమోదయ్యే ఓట్లపై అనుమానాలు ఉన్నాయి. ఓటరు వేసిన ఓటు సరిగ్గా నమోదైందని, అదే లెక్కిస్తారని నిర్ధారించడమే ప్రజాస్వామ్య లక్ష్యం. జర్మనీ వంటి దేశాలు ఈవీఎంలను పక్కనపెట్టి బ్యాలెట్ విధానాన్ని అనుసరిస్తున్నారు.

- డాక్టర్ పరకాల ప్రభాకర్, ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు

అత్యంత అనుమానించదగ్గ అంశం



మే 13న సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ 3 గంటల్లో గంటకు ఒక్కో పోలింగ్ బూత్‌లో సగటున ఏడుగురు ఓటర్లు ఓటు వేశారా? ఇక అదే రోజు రాత్రి 11.45 గంటల నుంచి తెల్లవారుజామున 2 గంటల వరకూ 2.15 గంటల్లో సగటున ఒక్కో పోలింగ్ బూత్‌లో 491 మంది ఓటు వేశారా? నిమిషానికి ముగ్గురు ఓటు వేశారా? ఇది అత్యంత అనుమానించదగ్గ అంశం. అద్భుత విజయం వెనుక దుర్మార్గం ఇదేనేమో? ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం మనది. ప్రజాస్వామ్యంపై ప్రజలకు విశ్వాసం కలగాలంటే పోలింగ్‌ను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలి. పోలింగ్ ప్రక్రియపై సందేహాలను కేంద్ర ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలి. కేంద్ర ఎన్నికల సంఘం అనుమానాలను నివృత్తి చేయకపోతే ప్రజల్లో ఎన్నికల ప్రక్రియపై విశ్వాసం సడలుతుంది. ఇది ప్రజాస్వామ్యానికి హాని చేస్తుంది. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే కేంద్ర ఎన్నికల సంఘం తక్షణం స్పందించాలి. ఆంధ్రప్రదేశ్ 2024 ఎన్నికల పోలింగ్ సరళిపై సందేహాలను నివృత్తి చేయాలి. కేంద్ర ఎన్నికల సంఘం స్పందిస్తుందని.. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై అనుమానాలను నివృత్తి చేస్తుందని ఆశిస్తున్నా.

- కరణ్‌ధాపర్, ప్రముఖ జర్నలిస్ట్

ఎన్నో అనుమానాలు.. ఈసీ బదులివ్వాల్సిందే..



2024 మే 13న సాయంత్రం 5 గంటల సమయంలో అప్పటి వరకూ ఓటింగ్ శాతం లెక్కలను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. 68.04 శాతం పోలింగ్ జరిగినట్లు పేర్కొంది. అయితే అప్పటికే పోలింగ్ బూత్‌లలో ఉన్నవారు ఓట్లు వేస్తారు కనుక అది పెరిగే అవకాశం ఉందని తెలిపింది. తర్వాత 8 గంటలకు మరో ప్రెస్ నోట్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. అందులో ఆంధ్రప్రదేశ్‌లో పోలింగ్ శాతం 68.12 శాతం అని ఉంది. ఇక అదే రోజు రాత్రి 11.45 గంటలకు 76.50 శాతంగా ఎన్నికల కమిషన్ పేర్కొంది. నాలుగు రోజుల తర్వాత మే 17న మరో ప్రెస్ నోట్‌ను విడుదల చేసింది. దానిలో 80.66 శాతం అని వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్య ఎన్నికల అధికారి పోలింగ్ శాతం 81.86 అని పేర్కొంటూ ట్వీట్ చేశారు. చివరిగా ఎన్నికల కమిషన్ అన్నిరకాల సమాచారాన్ని క్రోడీకరించి ఏపీలో పోలింగ్ శాతం 81.79గా నిర్ధారించింది. సాయంత్రం ఐదు గంటల వరకూ పది గంటల పాటు పోలింగ్ జరిగింది. అంటే గంటకు 6.8 శాతం, తర్వాత మూడు గంటలు 0.08 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. అంత తక్కువ పోలింగ్ ఎందుకు జరిగిందనే దానికి ఎన్నికల కమిషన్ ఇంత వరకూ వివరణ ఇవ్వలేదు. ఎన్నికల రోజు రాత్రి 11.45 గంటల నుంచి తెల్లవారుజామున 2 గంటల మధ్య 3,500 పోలింగ్ బూత్‌లలో 4.16 శాతం పోలింగ్ పెరిగింది. అంటే గంటకు 2 శాతం కంటే ఎక్కువ జరిగింది. అంత భారీ స్థాయిలో ఆ సమయంలో ఓటింగ్ ఎలా జరిగిందనేది పెద్ద ప్రశ్న. కేవలం 2.15 గంటలలో 17,19,482 మంది ఓట్లు వేసేశారు. అంటే ఒక్కో పోలింగ్ బూత్‌లలో 491 మంది ఓట్లు వేశారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరిగిన ఓటింగ్‌లో ఏపీలో ఉన్న 46,389 బూత్‌లలో గంటకు దాదాపు 60 ఓట్లు పడ్డాయి. అంటే నిమిషానికి ఒక ఓటు చొప్పున పడ్డాయి. కానీ అర్ధరాత్రి ఒక్కో బూత్‌లో 491 మంది.. అంటే నిమిషానికి ముగ్గురు కంటే ఎక్కువ మంది ఓట్లు వేశారు. ఇది సాధ్యమయ్యే పనేనా? 3,500 పోలింగ్ బూత్‌లలో అప్పటికే 17 గంటల పాటు పోలింగ్ జరిగితే సగటున గంటకు 24 మందే ఓట్లు వేశారు. అదే అర్ధరాత్రి 11.45 నుంచి 2 గంటల మధ్య గంటకు 200 మంది కంటే ఎక్కువ ఓట్లు వేశారు. ఈ నెంబర్ల మధ్య అనుమానాలకు ఎన్నికల కమిషన్ సమాధానం చెప్పాలి. అర్ధరాత్రి బారులు తీరి ఉన్న ఓటర్ల వీడియోలు బయటపెట్టాలి".

- ప్రొఫెసర్ నాగేశ్వర్, రాజకీయ విశ్లేషకులు



12.5% ఓట్ల వ్యత్యాసం ఉంది

2024 ఏపీ ఎన్నికల్లో దేశంలోనే అతిపెద్ద ఎలక్టోరల్ అనామలీ (electoral anomaly) జరిగింది. సుమారు 48 లక్షల ఓట్లు. అంటే 12.5% ఓట్ల విషయంలో వ్యత్యాసం ఉంది. ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేసేందుకు ఈవీఎంల స్థానంలో పేపర్ బ్యాలెట్లను తిరిగి ప్రవేశపెట్టాలి. ప్రజాస్వామ్యం నిస్సందేహంగా అమలవుతున్నట్లు ప్రజలకు కనిపించాలి.

- వైయస్ జగన్ మోహన్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి

వీవీప్యాట్ స్లిప్పులను ఎందుకు లెక్కించరు?



ఓట్ల లెక్కింపుపై అనుమానాలు వ్యక్తమవుతుంటే వీవీ ప్యాట్ స్లిప్పులను ఎందుకు లెక్కించడం లేదు? అర్ధరాత్రి భారీగా పోలింగ్ జరిగిందని చెబుతున్నప్పుడు దానికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలు ఎందుకు చూపించడం లేదు. ఈవీఎంలలో అవకతవకలకు అవకాశం ఉందన్న అంశాన్ని గతంలో చంద్రబాబే ప్రస్తావించారు. ఇప్పుడు ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నందున ఈ అంశంపై విచారణ జరిపించి వాస్తవాలను వెల్లడించాలి. సర్ పేరుతో చాలా మంది ఓట్లు తీసేస్తున్నారు. ఇటీవల ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో స్టాలిన్, మమతా బెనర్జీ ఓటమి చెందిన నియోజకవర్గాల్లో అదే జరిగింది. ఏపీలోనూ అదే పరిస్థితి వస్తుంది.

- ఉండవల్లి అరుణ్ కుమార్, మాజీ ఎంపీ, రాజకీయ విశ్లేషకులు

ప్రజల అనుమానాలు తీసిపారేయలేం



ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) పనితీరుపై ప్రజలు, రాజకీయ పార్టీల్లో తలెత్తుతున్న అనుమానాలను ఏమాత్రం తీసిపారేయలేం. ఈ అనుమానాలను నివృత్తి చేయాల్సిన ప్రాథమిక బాధ్యత ఈసీపై ఉంది. పోలైన వీవీప్యాట్ స్లిప్పులను కచ్చితంగా వంద శాతం లెక్కించాలి. దీనిపై ఈసీ చెబుతున్న సాకులు సరికాదు. కేంద్ర ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియ కోసం ఏర్పాటు చేసే ఎంపిక కమిటీ (కొలీజియం)లో ప్రధాని, కేంద్ర మంత్రి, ప్రతిపక్ష నేత ఉంటే అది 2:1 నిష్పత్తిలో అధికార పార్టీకి అనుకూలంగా మారిపోతుంది. అందువల్ల సీజేఐ కచ్చితంగా ఉండి తీరాలి. జమిలి ఎన్నికల విధాన ఆచరణలో ఎండమావి లాంటిదే.

- ఎస్.వై.ఖురేషీ, మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్